క్లుప్తంగా

## డీఎస్పీ కుటుంబీకులకు ఎమ్మెల్యే పరామర్శ



శ్రీరాం కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ ఎనిమిది నెలల క్రితం శ్రీరాం అనారోగ్యంతో మృతి చెందారు. ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. డీఎస్పీగా శ్రీరాం ఖేడ్ డివిజన్‌లో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. శ్రీరాం కుమార్తెకు డీజీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం నియమించిన సందర్భంగా నియామక ప్రతినీ ఎమ్మెల్యే అందజేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి



మాట్లాడుతున్న రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి ప్రజలకు సూచించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో మంగళవారం రోజారాణి పర్యటించారు. కాలనీల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోజారాణి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆయా వార్డుల కౌన్సిలర్‌లు పాల్గొన్నారు

## ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్సై ఆంజనేయులు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం బస్టాండ్ సమీపంలో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ....రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. పరిమితికిమించి ప్యాసింజర్లను ఎక్కించుకోకూడదని సూచించారు. మద్యం సేవించి నడిపితే ఆటోను సీజ్ చేసి, కోర్టుకు పంపుతామన్నారు.

## ఫార్మసీ విద్యార్థుల ఆందోళన

కంది(సంగారెడ్డి): కందిలో తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీ ఫార్మసీ విద్యార్థులు ధర్నా చేపట్టారు. మంగళవారం ఆర్య ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ధర్నాలో విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో తగిన బోధన సిబ్బంది లేరన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఇంటర్నల్ మార్కులను కట్ చేస్తామని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. విద్యార్థుల సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రిన్సిపాల్ రాజిరెడ్డి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

## వీరభద్రేశ్వర ఆలయంలో పూజలు



దంపతులను సన్మానించిన ఆలయ సిబ్బంది

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం ఘన్‌పూర్‌కు చెందిన భక్తుడు శంకర్ అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆలయ పురోహితులు భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించి, మహాహారతి నిర్వహించి ప్రసాదాన్ని సమర్పించారు. అన్నదానం ఏర్పాటు చేసిన శంకర్‌కు అర్చకులు ఆశీర్వచనాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇ.కృష్ణ, వీరయ్య స్వామి, శివకుమార్ స్వామి, బస్వరాజ్ స్వామి, మల్లికార్జున్ స్వామి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న విభేదాలు

విగ్రహం ఏర్పాటుకు అభిప్రాయ భేదాలు



విగ్రహం ఏర్పాటుకు రోడ్డు మధ్యలో తీసిన గుంత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుకు కాంగ్రెస్ కౌన్సిలర్లు మయూరి రాజుగౌడ్, రాంసింగ్‌నాయక్ కొల్లూర్ అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. కొల్లూర్‌లో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కౌన్సిలర్ మయూరి రాజుగౌడ్ గతంలో భూమిపూజ చేశారు. దీంతో అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని తీసుకొచ్చి కొల్లూర్ ముఖద్వారం వద్ద అక్కడే విగ్రహ ఏర్పాటుకు మళ్లీ భూమిపూజ నిర్వహించారు. ఆ సమయంలో కౌన్సిలర్లకు అధికార పార్టీకి చెందిన నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంలో ఎమ్మెల్యే కలగజేసుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. విగ్రహం ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు కలిసి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం కొల్లూర్ ముఖద్వారం వద్ద రోడ్డు మధ్యలో విగ్రహం ఏర్పాటు చేయడానికి గుంత తవ్వారు. ఇక్కడ విగ్రహం ఏర్పాటు పనులను నిలిపివేయాలని స్థానిక కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తాము వ్యతిరేకంకాదని ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండే స్థలాన్ని ఎంపిక చేసి విగ్రహ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కోరారు. రోడ్డు మధ్యలో విగ్రహం ఏర్పాటు చేస్తే జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

## పిల్లల ఎదుగుదలకు పోషకాహారం

ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ



సదాశివపేట రూరల్ : పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ రాజు

పటాన్‌చెరు టౌన్: పిల్లల ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోషకాహార లోపాన్ని నివారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ తల్లిదండ్రులను కోరారు. పోషణపక్వాడలో భాగంగా మంగళవారం పటాన్‌చెరు పాశమైలారం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల కోసం వంట కాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ...పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సల్మా, పోషణ అభియాన్ కో-ఆర్డినేటర్ సాయి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్ లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): పోషణ పక్షంలో భాగంగా బాలింతలు, మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తినే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, మంచి ఆహారం తీసుకోవాలన్నారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ కుందెన రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి పేర్కొన్నారు. నందికంది గ్రామంలో పోషణ అభియాన్‌లో భాగంగా పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం పౌష్టికాహారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్ విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకోవాలి

రైతు అవగాహన సదస్సుల్లో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సంగారెడ్డిమున్సిపాలిటీ: ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఫలపరిశోధన కేంద్రంలో మంగళవారం 'ఉద్యానవన పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫలపరిశోధన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పండ్లతోటలకు రైతులు ముందు జాగ్రత్తగా షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం కృష్ణతేజ, ఎఫ్ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.సుచిత్ర, హరికాంత్, నితీష్, మౌనిక, డాక్టర్ జ్యోతిర్మయి, జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.సునీత, ఏడీ సత్తార్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై చలో ఢిల్లీ



జోగిపేట(అందోల్): మాట్లాడుతున్న సాయిలు

జోగిపేట(అందోల్): పాలకుల నిర్లక్ష్యంతో, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ సంఘాల ఉమ్మడి జాతీయ పిలుపులో భాగంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ చేపడుతున్నట్లు జిల్లా కార్యదర్శి జి.సాయిలు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యొక్క వైఖరిని వివరిస్తూ ప్రజలను, రైతులను, కార్మికులను చైతన్యం చేస్తూ సంగారెడ్డి జిల్లాలో ప్రచారయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం జోగిపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక సత్తాను చాటాలన్నారు. కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, సీఐటీయూ అందోల్ డివిజన్ నాయకుడు విద్యాసాగర్, రాములు, శివకుమార్, పాల్గొన్నారు.

నారాయణఖేడ్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ పేరిట జంతర్‌మంతర్‌లో 10లక్షల మందితో మహాధర్నా నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు తెలిపారు. మహాధర్నా ప్రచారజీపుజాత మంగళవారం ఖేడ్‌కు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, చిరంజీవి, నరేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

# పార్టీకి బలం కార్యకర్తలే..



పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): పార్టీకి బలం కార్యకర్తలేనని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రతీ పథకాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 28 నుంచి నియోజవకర్గ వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తామన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్తను కాపాడుకునేలా బీమా చేయించామన్నారు. బీఆర్ఎస్‌కి 65లక్షల సభ్యత్వం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, మండలాల అధ్యక్షులు రాజేశ్, హుస్సేన్ పాల్గొన్నారు.

## రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తాం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్‌కు ప్రభుత్వ పరంగా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, మసీద్ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి సమీక్ష జరిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేర అన్ని పండగల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. అందులో భాగంగానే మసీదుల వద్ద రోడ్ల మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ దీపాల ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ స్వామి, డీఎస్పీ రఘు, సీఐ భూపతి, ఎస్సై వినయ్‌కుమార్, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, బీఆర్ఎస్ నాయకుడు మొహియొద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# సమస్యల పరిష్కారానికి కృషి



కంటి అద్దాలు పెడుతున్న పుష్పనగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ పుష్పనగేశ్ తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌లో బస్తీదర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సీసీ రోడ్లను, వర్షాలు పడినప్పుడు రోడ్లపై వర్షపు నీరు చేరుతుందని స్థానికులు వివరించారు. అనంతరం కార్పొరేటర్ పుష్పనగేశ్ మాట్లాడుతూ ప్రజలు లేవనెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**కంటివెలుగు ప్రారంభం**

జ్యోతినగర్‌కాలనీలోని కమ్యూనిటీహాల్లో కంటివెలుగును కార్పొరేటర్ పుష్ప నగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతినగర్, వినాయకనగర్, కానుకుంట వాసుల ఉపయోగార్థం జ్యోతినగర్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ గౌడ్, రాజు, మల్లేశ్, కిషోర్ పటేల్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



కౌలుదారునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బాధితులకు భరోస కల్పించారు. మంగళవారం కంకోల్, మగ్దుంపల్లి, ఖమ్మంపల్లి, పెద్దచల్మెడ, చిన్నచల్మెడ, మల్లికార్జునపల్లి, అంతారం గ్రామాల్లో మామిడి, జామ, ఉల్లిగడ్డ, నిమ్మకాయ, పొప్పడితోట, వంకాయ, టమాటా పంటలను ఆయా శాఖల అధికారులతో పరిశీలించారు. వడగళ్ల వర్షంతో మామిడి, వివిధ రకాల కూరగాయలు దెబ్బతిన్నాయని రైతులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్నారు. అనంతరం పంట నష్ట పరిహారం మంజూరునకు సంబంధిత జిల్లా హార్టికల్చర్ అధికారి సునీత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఎమ్మెల్యేతో చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు విశ్వనాథం, అశోక్, రమేశ్, చిలపల్లి సర్పంచ్ వీరన్న, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, తహసీల్దార్ శివకుమార్, మండల అధికారి కీర్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, సంఘీత, స్నేహ, బుదేరా ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అప్పారి వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి త్యాగనిరతిని, పోరాట పటిమను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, కార్యదర్శి సాయితేజ నాయకులు వెంకయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిద్దాం

సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ప్రవీణ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని పట్టణ సీపీఎం కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం జన చైతన్య యాత్ర వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ పరిశ్రమలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. దేశమంటే అంబాని అదాని సొత్తుగా మార్చారని, వంటనూనె పెట్రోల్, డీజిల్ నిత్యాసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉద్యానవన అధికారుల పర్యటన



కోహీర్(జహీరాబాద్): పంట నష్టం వివరాలను సేకరిస్తున్న అధికారులు

కోహీర్(జహీరాబాద్): ఎఫ్ఆర్ఎస్ శాస్త్రవేత్తలతో కలిసి ఉద్యానవన శాఖ అధికారులు మంగళవారం కోహీర్‌లో పర్యటించారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన మామిడి తోటలను పరిశీలించారు. బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, పైడిగుమ్మల్, ఖానాపూర్, కోహీర్ గ్రామ శివార్లలో సుమారు1250 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లిందని నిర్ధారణకు వచ్చారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సునీత, జహీరాబాద్ డివిజన్ అధికారి స్పందన, ఎఫ్ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత సుచిత్ర, ఏఈఓ శ్రీనివాస్, ఎంపీపీ ఉపాధ్యక్షులు షాకీర్ అలీ తదితరులు ఉన్నారు.

**హత్నూరలో**

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో జోగిపేట వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణ మంగళవారం పంటలను పరిశీలించారు. చిక్‌మద్దూర్‌లో వరి పంటను చూసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు అగ్గి తెగులు సోకే అవకాశం ఉందన్నారు. దీనికి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ స్రవంతి, రైతులు సుదర్శన్, రాములు, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **15 మందికి కోవిడ్ పరీక్ష..ఒకరికి పాజిటివ్**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 15మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికీ పాజిటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

◆ **రైతుకు నష్టపరిహారం చెల్లించాలి**

సదాశివపేట(సంగారెడ్డి): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి. వినోద డిమాండ్ చేశారు. నష్టపోయిన పంటలను సర్వే చేసి పరిహారం చెల్లించాలని మంగళవారం తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల రైతులు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తఫా, ఎం. రమేష్, మహబూబ్ పాల్గొన్నారు.

◆ **ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**

పటాన్‌చెరు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం (శ్రీ శోభకృత్ నామ సంవత్సరం) సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ‘శోభకృత్’ అంటే శుభాలను కలిగించేదని.. పేరుకు తగ్గట్టుగా కొత్త ఏడాదిలో అందరికీ శుభమే జరగాలని ఆకాంక్షించారు.

◆ **విద్యార్థులకు అండగా ఉంటాం**

హత్నూర( సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటామని, సునీతమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని బీవీ శివశంకరరావు తెలిపారు. మంగళవారం సిరిపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయా సర్టిఫికేట్లకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఆ దరఖాస్తు ఫారంలో పూర్తి సమాచారాన్ని పొందుపరచి ఆధార్ కార్డు, బోనఫైడ్ జత చేసి తమ సంస్థ ప్రతినిధులకు అందజేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. తాము మీ సేవలో దరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయం నుంచి సంబంధిత ధ్రువపత్రాలు మీసేవ ద్వారా సేకరించి సంబంధిత విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **జన చైతన్య యాత్రకు సంపూర్ణ మద్దతు**

పటాన్‌చెరు: బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం జన చైతన్య యాత్రకు సంపూర్ణ మద్దతు అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సీపీఎం బృందం సభ్యులు జన చైతన్య యాత్రకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో రమణ, రామాంజులమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. రామాంజులమ్మ బోన్ క్యాన్సర్‌తో తీవ్ర ఇబ్బంది పడుతుంది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి మంగళవారం రూ.10వేలు బాధిత కుటుంబానికి అందించారు.

◆ **కుస్తీ పోటీలకు ఏర్పాట్లు**

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్ భవనీమందిరం వద్ద ఉగాది ఉత్సవాల్లో భాగంగా కుస్తీపోటీలకు అవసరమైన మైదానాన్ని చేసులో తయారు చేస్తున్నారు. కుస్తీ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భూమిని చదును చేయిస్తున్నారు. కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్ ఆయా పనులను పర్యవేక్షించారు.

◆ **కష్టపడి చదవాలి**

నారాయణఖేడ్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని బంజారా ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిపి రాథోడ్ అన్నారు. ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్లో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2వేల మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, అందించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవీసింగ్ చౌహాన్ పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలకు వీరహనుమాన్ ఆలయం ముస్తాబు



రాయికోడ్(అందోల్): మహమ్మదాపూర్ గ్రామంలో నిర్వహించే ఉగాది వేడుకలకు వీరహనుమాన్ ఆలయం ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. ఆలయ పరిసరాలను చదును చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేశారు. వేడుకల్లో భాగంగా సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22, 24, 26తేదీల్లో రాత్రి 9.30 గంటలకు మూడు విడతలుగా నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.